సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 8 । ఫిబ్రవరి । 2024



పర్యాటకులకు ఇక్కట్లు

బొర్రాగుహలకు వెళ్లేమార్గంలో గేటు వలన వద్ద రైల్వే గేటు పడినప్పుడల్లా పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. 8లో



యాంపీ థియేటర్ పరిశీలన

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ పర్యటన నేపథ్యంలో ఆంధ్రా యూనివర్సిటీలోని యాంపీ థియేటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. 8లో



వేడుకగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి నిత్యకల్యాణాన్ని బుధవారం వేడుకగా నిర్వహించారు.

ఆపద్బాంధవిలా..

- పాడి రైతును కష్టకాలంలో ఆదుకుంటున్న వైఎస్సార్ పశు బీమా
- ప్రీమియం మొత్తంలో 80 శాతం భరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఒక్కసారి చెల్లిస్తే మూడేళ్లకు వర్తింపు
- గతేడాది 875 మంది రైతులకు రూ.18,88,194 చెల్లింపు



పశు బీమాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ముంచంగిపుట్టు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ పశుబీమా పథకంతో పాడి రైతులకు భరోసా లభించింది. ప్రమాదవశాత్తూ పశువులు మరణిస్తే వాటిపై ఆధారపడి జీవిస్తున్న రైతులను ప్రభుత్వం బీమా వర్తింపజేసి కష్టకాలంలో ఆపద్బాంధవుడిలా ఆదుకుంటోంది. ప్రీమియం మొత్తంలో 80 శాతం ప్రభుత్వమే భరిస్తోంది. స్వల్ప మొత్తాన్ని చెల్లిస్తే అధిక ప్రయోజనం పొందవచ్చని పశువైద్యశాఖ సూచిస్తోంది.

ప్రీమియం ఇలా..

- తెలుపు రేషన్ కార్డు కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీలు రూ.30 వేల విలువైన పశువుకు మూడేళ్ల కాలవ్యవధికి రూ.384, పెద్దరైతులైతే రూ.900 ప్రీమియం చెల్లించాలి. పశువులకు రూ.30 వేలకు పైబడి ఉంటే 6.4శాతం అధికంగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని అధికారవర్గాలు తెలిపాయి.
- గొర్రెలు, మేకలు, పందులకు ఏడాదికి, రెండేళ్లకు, మూడేళ్లకు బీమా చేయించుకోవడానికి అవకాశం ఉంది. ఎస్సీ, ఎస్టీ,బీసీలకు తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతీ రైతు ఒక గొర్రె లేదా మేకకు ఏడాదికి రూ.36 ప్రీమియం చెల్లించాలి.రెండేళ్లకు రూ.54,మూడేళ్లకు రూ.76 ప్రీమియం చెల్లించాలి.పెద్ద రైతు కుటుంబాల వారైతే ఏడాదికి ఒక గొర్రె లేదా మేకకు రూ.90 ప్రీమియం చెల్లించాలి.రెండేళ్లకు రూ.135,మూడేళ్లకు రూ.187.50 చెల్లించాల్సి ఉంటుంది.

నిబంధనలివే..

పశువులకు బీమా చేయించే సమయంలో బ్యాంక్ పాస్ పుస్తకం,ఆధార్ కార్డుతో పాటు ఎస్సీ,ఎస్టీ లబ్ధిదారులు బియ్యం కార్డు,కుల ధ్రువీకరణ పత్రం తీసుకువెళ్లాలి. పశువు, గొర్రె, మేక మృతి చెందిన సందర్భంలో దగ్గరలోని రైతు భరోసా కేంద్రంలోని పశువైద్య సహాయకులకు లేదా పశువైద్యాధికారికి లేదా 1962కు ఫోన్ చేసి తెలియజేయాలి.

- పశువు, గొర్రె, మేకకు తప్పనిసరిగా చెవిపోగు వేయించాలి. చెవిపోగు లేకుంటా బీమా మంజూరు కాదు. ఒక వేళ ట్యాగ్ (చెవిపోగు) పడిపోతే వెంటనే సమీప ఆర్‌బీకే, పశు వైద్యశాలలో తెలియజేసి కొత్తది వేయించాలి. ప్రమాదవశాత్తూ పశువులు మృతి చెందిన సందర్భంలో ఎఫ్‌ఐఆర్ కచ్చితంగా నమోదై ఉండాలి. బీమా చేయించిన పశువును అమ్మిన వెంటనే (7 రోజుల లోపే) బీమా కంపెనీ వారికి తెలియజేసి, బీమా పాలసీని కొనుగోలు దారుని పేరుపై నమోదు చేయించుకోవాలి.
- జిల్లాలో 2023లో 3,666 మంది రైతులు 10,105 పశువులు, మేకలు, గొర్రెలకు బీమా చేయించారు. 2024లో జనవరి నెల నుంచి ఇప్పటివరకు 856 మంది రైతులు 2744 జీవాలకు బీమా చేయించారు.



పశువుకు ట్యాగ్ వేస్తున్న సిబ్బంది

- గత ఏడాది పలు కారణాల వల్ల మృతి చెందిన 875 మంది రైతుల పశువులకు ప్రభుత్వం రూ.18,88,194ల మేర నష్టపరిహారం వారి ఖాతాల్లో జమ అయింది.

రూ.6 వేల నష్టపరిహారం పొందా



గతంలో పశు బీమా ఉంటే తప్ప ప్రభుత్వం తరఫున పైసా కూడా పరిహారం వచ్చేది కాదు. రూ.6వేల నుంచి రూ. 30 వేల వరకు నష్ట పరిహారం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ పశు బీమా పథకాన్ని రూపొందించింది. ఈ పథకం ద్వారా తమకు కొండంత ధైర్యం నిస్తోంది. మేక చనిపోతే రూ.6 వేల మేర బీమా జమ అయింది. దీంతో ఆర్థిక ఇబ్బందుల నుంచి రైతులు గట్టెక్కుతున్నారు.

– కె.బొజ్జన్న, గిరిజన రైతు, కిలగాడ, ముంచంగిపుట్టు మండలం

21 రోజుల్లో పరిహారం



పశుబీమా పథకం పాడి రైతులకు ఎంతో మేలు. పశువులు మృతి చెందిన వెంటనే పశు వైద్యాధికారులకు సమాచారం అందించాలి. పంచనామా, పోస్టు మార్టం చేస్తాం. పశువులకు సంబంధించిన అన్ని పత్రాలు,జియో ట్యాగింగ్ ఫొటోలను బాధిత రైతులు అందించాలి. చనిపోయిన పశువును కచ్చితంగా పూడ్చాలి.అన్ని పత్రాలు సక్రమంగా ఉంటే పాడి రైతులకు 21 రోజుల్లో పరిహారం మంజూరు అవుతుంది.

– నరసింహులు, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి, పాడేరు

న్యూస్‌రీల్

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

- చింతూరు ఐటీడీఏ పీవో చైతన్య



వినతులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో చైతన్య

చింతూరు: స్పందన దృష్టికి ప్రజలు తీసుకువచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఆదేశించారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల 23 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఒకవేళ అలస్యమైతే దానికి గల కారణాలను అర్జీదారులకు తెలియజేయాలని ఆయన ఆదేశించారు.

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

- వణికిస్తున్న చలి



పాడేరులో దట్టంగా కురుస్తున్న పొగమంచు

సాక్షి, పాడేరు: మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. పొగమంచు ఉదయం 9గంటల వరకు దట్టంగా కురుస్తోంది. పాడేరు మండలం మినుములూరు,చింతపల్లిలో 14డిగ్రీలు, అరకులోయ కాఫీ బోర్డు వద్ద 15.1డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అర్ధరాత్రి నుంచి తెల్లవారే వరకు చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది.

ఆంగ్ల అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

రంపచోడవరం: రాజవొమ్మంగి ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఆంగ్ల సబ్జెక్టుకు సంబంధించి ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పీవో సూరజ్‌గనోరే సూచించారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తామన్నారు. డిగ్రీ లేదా పీజీతోపాటు బీఈడీలో 50 శాతం ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. ఏపీ టెట్ క్వాలీఫై అయి ఉండాలన్నారు. రెండు లెవెల్స్‌లో ఇంగ్లీషు మీడియంలో చదివి ఉండాలన్నారు. దరఖాస్తులను రంపచోడవరం గురుకులం సెల్‌లో ఈనెల 10వ తేదీలోగా అందజేయాలని ఆయన కోరారు.

పాడేరులో తేనెటీగల బెడద

- గుంపులుగా దాడి



పాడేరు పాత అటవీశాఖ కార్యాలయం ఆవరణలోని చెట్లకు భారీ తేనెపట్టులు

సాక్షి,పాడేరు: పట్టణంలో పలుచోట్ల తేనెటీగల బెడద నెలకొంది. రోడ్లపైకి ఒక్కసారిగా గుంపులుగా వస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బుధవారం మధ్యాహ్నం పాత బస్టాండ్ అంబేడ్కర్ సెంటర్‌లో తేనెటీగలు గుంపుగా వచ్చి చిరువ్యాపారులు, పాదచారులపై దాడి చేసి గాయపరిచాయి. రెండు వారాల క్రితం పాడేరు అటవీశాఖ పాత కార్యాలయం సమీపంలోను ఇద్దరిపై తేనెటీగలు దాడి చేసి గాయపరిచాయి. అటవీశాఖ పాత కార్యాలయం ఆవరణలో భారీ వృక్షాలకు అధికంగా ఉన్న తేనెపట్టుల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డీటీపీ కోర్సులో శిక్షణకు దరఖాస్తులు

కంచరపాలెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా కంచరపాలెం పాత ఐటీఐలో స్కిల్ హబ్స్ ద్వారా నిరుద్యోగ యువతకు డేటా ఎంట్రీ ఆపరేటర్ షార్ట్ టర్మ్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె శ్రీకాంత్, జిల్లా నైపుణ్యాధికారి సాయి కృష్ణచైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ ఉత్తీర్ణులై 30 ఏళ్ల లోపు గల వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 20 లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 79810–22453 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్ నిర్మాణానికి స్థల పరిశీలన

- అడవికి నష్టం లేకుండా చర్యలు
- అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ శ్రీకంఠనాథ్‌రెడ్డి
- జెన్‌కో అధికారులతో క్షేత్రస్థాయి సందర్శన



విలేకరులతో మాట్లాడుతున్న అటవీశాఖ సీసీఎఫ్ శ్రీకంఠనాథ్‌రెడ్డి, జెన్‌కో అధికారులు

సీలేరు: ఏపీ జెన్‌కో సీలేరు ప్రాంతంలో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్ నిర్మాణానికి అనుమతి ఇచ్చేందుకు స్థల పరిశీలన చేస్తున్నామని అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ శ్రీకంఠనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ప్రాజెక్టుకు అవసరమైన అటవీ స్థలాన్ని జెన్‌కో అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీఎఫ్ మాట్లాడుతూ అటవీ సంపదకు ఎటువంటి నష్టం జరగకుండా ప్రాజెక్ట్ నిర్మాణానికి అటవీశాఖ అనుమతి ఇస్తుందన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి 215 హెక్టార్లు అవసరం ఉందన్నారు. ఇందులో అటవీ భూమి ఉన్నందున అనుమతికోసం జెన్‌కో అధికారులు దరఖాస్తు చేశారన్నారు. దీనిలో భాగంగానే సర్వే చేపడుతున్నామన్నారు. అటవీ సంపదకు, వన్య ప్రాణులకు ఎటువంటి నష్టం లేకుండా ఉండేలా ప్రణాళిక తయారు చేసి ఇస్తామన్నారు. ఇందుకు అవసరమైన ఖర్చును, ప్రత్యామ్నాయ భూమిని జెన్‌కో కేటాయిస్తుందని తెలిపారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించి డీపీఆర్‌లో నాలుగు చోట్ల పొందుపరిచిన స్థలాన్ని పరిశీలించినట్టు చెప్పారు.

టెండర్లు పూర్తి: ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి

ఏపీ జెన్‌కో సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లో నూతనంగా నిర్మించబోయే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు అవసరమైన టెండర్లు పూర్తయ్యాయని ఆ ప్రాజెక్టు ఎస్‌ఈ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తొమ్మిది యూనిట్ల సామర్థ్యం గల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్ నుంచి 1350 మెగావాట్ల అదనపు విద్యుత్ ఉత్పత్తి చేయడమే లక్ష్యమన్నారు. ఇందుకు రూ.11 వేల కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి అటవీశాఖ నుంచి పర్యావరణపరంగా అనుమతులు రావాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించి ఈనెల 9వ తేదీన సమావేశం జరుగుతుందన్నారు. ప్రాజెక్ట్ పనులు ప్రారంభించేందుకు ఆరు నెలల సమయం పడుతుందన్నారు. జెన్‌కో చీఫ్ ఇంజనీర్ శ్రీధర్, ఎస్‌ఈ ప్రశాంత్ కుమార్, ఈఈ ప్రభాకరరావు, అటవీశాఖ డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్, సబ్ డీఎఫ్‌వో బెన్నాడ రాజు రేంజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అపోహలు వీడి రక్తదానం చేయండి

ఎస్పీ తుహిన్ సిన్హా



హుకుంపేటలో రక్తదానం చేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

హుకుంపేట: అపోహలు వీడి రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఎస్పీ తుహిన్ సిన్హా పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో అధ్యక్షతన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన కూడా రక్తదానం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ రోగులు, గర్భిణుల, బాలింతలు, సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు రక్తం అవసరం ఉందన్నారు. అన్నివర్గాల ప్రజలు ముందుకు వచ్చి రక్తదానం చేసి కొరత లేకుండా చూడాలని సూచించారు. రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లను 27వ సారి రక్తదానం చేసిన పాడేరు సీఐ సుధాకర్‌ను ఆయన అభినందించారు. ఈ శిబిరంలో 53 మంది రక్తదానం చేసినట్టు ఎంపీడీవో తెలిపారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, ఈవోపీఆర్డీ అప్పలరాజు, వైద్యాధికారి రాజీవ్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పి.సూర్యారావు, జిల్లా కోఆర్డినేటర్ లోహితాస్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ విధానంతో ఆరోగ్యకర ఉత్పత్తులు



ఆదర్శ రైతులకు సత్కారం



జీవ వైవిధ్య సదస్సులో పాల్గొన్న రైతులు

అరటి పరిశోధన స్థానం శాస్త్రవేత్తల సూచన

వై.రామవరం: సేంద్రియ విధానంలో సాగు చేయడం వల్ల ఆరోగ్యకర ఆహార ఉత్పత్తుల దిగుబడి సాధించవచ్చని అరటి పరిశోధన స్థానానికి చెందిన శాస్త్రవేత్తలు సూచించారు. బుధవారం మండలంలోని గుమ్మరిపాలెంలో లయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సేంద్రియ వ్యవసాయ జీవ వైవిధ్య సదస్సులో జిల్లాతోపాటు పార్వతీపురం మన్యం జిల్లాకు ఆదివాసీ రైతులు పాల్గొన్నారు. కొవ్వూరుకు చెందిన అరటి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సేంద్రియ సాగుపై అవగాహన కల్పించారు. చిరు ధాన్యాలు, పప్పుదినుసులు, చిక్కుడు జాతి విత్తనాలు, దుంపల రకాలు, ఔషధ మొక్కలతో ప్రదర్శన నిర్వహించారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గిస్తూ సాధించే దిగుబడులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుందని పేర్కొన్నారు. లయ సంస్థ సహజ వనరుల యాజమాన్య విభాగం మేనేజరు కె.కోటేశ్వరరావు, బుర్రి చక్రబాబు, ఆకుల పద్మావతి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించండి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, చిత్రంలో జేసీ భావన, పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి



హాజరైన తహసీల్దార్లు

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

సాక్షి, పాడేరు: తమ మండలాల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్లంతా సందర్శించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఇటీవల పాడేరు డివిజన్‌కు బదిలీపై వచ్చిన కొత్త తహసీల్దార్లతో బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల సందర్శనలో తమ దృష్టికి వచ్చిన అన్ని అంశాలపై తమకు నివేదిక ఇవ్వాలన్నారు. ఎన్నికల నియామవళిని కచ్చితంగా అమలుజేయాలని, ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థుల ఖర్చుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. మీడియా, పత్రికలలో ప్రచురిస్తున్న అభ్యర్థుల ప్రకటనలు,కరపత్రాలు,గోడపత్రికలు, ప్రసార మాధ్యమాల్లో ప్రకటనల వివరాల ఖర్చును సమగ్రంగా లెక్కించి నమోదు చేయాలని సూచించారు. ఎన్నికల విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, ఎన్నికల కమిషన్ ఆదేశాలను పకడ్బందీగా అమలు జేయాలని సూచించారు. జోనల్,బూత్ స్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు.ఈ సమావేశంలో జేసీ భావన, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్,సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఎస్‌డీసీలు అంబేడ్కర్, శర్మ, తహసీల్దార్లు పాల్గొన్నారు.

సేవలకు సలాం!

- కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలుడికి పింఛను అందజేసిన చింతపల్లి వలంటీర్



కేజీహెచ్‌లో దివ్యాంగ బాలుడికి పింఛను అందజేస్తున్న గ్రామ వలంటీర్ సుధీర్

పాడేరు : గ్రామ వలంటీర్లు ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేరుస్తూ అన్నివర్గాల ప్రజల మన్ననలు పొందుతున్నారు. చింతపల్లికి చెందిన గ్రామ వలంటీర్ కొర్రా సుధీర్ సుమారు 200 కిలోమీటర్ల దూరం వెళ్లి ఈనెల పింఛను సొమ్మును కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న దివ్యాంగ బాలుడు మాతిరెడ్డి నాగ జశ్వంత్ అందజేశాడు. ఇటీవల కాలుకి శస్త్ర చికిత్స నిమిత్తం జశ్వంత్‌ను కుటుంబసభ్యులు కేజీహెచ్‌లో చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ సుధీర్ బాలుడికి రూ.3 వేల పింఛను సొమ్ము అందజేశాడు. ఈ సందర్భంగా జశ్వంత్ తల్లి తిరుపతమ్మ వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపింది.

పాడేరు ఐటీడీఏ స్పందన రద్దు

- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: స్థానిక ఐటీడీఏలో ఈనెల 9వతేదీన జరగాల్సిన జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని పరిపాలన పరమైన కారణాలతో రద్దు చేశామని కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పందన రద్దు సమాచారాన్ని జిల్లా ప్రజలు తెలుసుకుని విజ్ఞప్తులు అందించేందుకు శుక్రవారం పాడేరు ఐటీడీఏకు రావొద్దని ఆయన పేర్కొన్నారు.

కుళ్లిన మేక మాంసం తినిన గిరిజనులకు తీవ్ర అస్వస్థత



అస్వస్థతకు గురైన గిరిజనులను అంబులెన్సులో ఆస్పత్రికి తరలింపు



ఆర్‌వీ నగర్ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితులు

- ఆర్‌వీ నగర్ పీహెచ్‌సీకి తరలింపు
- ఎనిమిది మంది పరిస్థితి విషమం

గూడెంకొత్తవీధి: కుళ్లిన మేక మాంసం తినిన సుమారు పదిమందికి పైగా గిరిజనులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మండలంలోని లంకపాకలు సమీప మూలగరువు గ్రామంలో బుధవారం అనారోగ్యంతో చనిపోయిన మేకను కోసుకుని గ్రామస్తులు తిన్నారు. దీంతో ఒక్కసారిగా వాంతులు విరోచనాలతో పొంగి మల్లేశ్వరరావు, అప్పారావు, చిలకమ్మ, మలితి, జ్యోతి, కొర్రా రామన్న, వంతల సుబ్బారావు, మర్రి కమల తదితరులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని స్థానికులు 108 వాహనంలో ఆర్‌వీ నగర్ పీహెచ్‌సీకి తరలించారు. వైద్యాధికారి సౌమ్య వీరికి ప్రథమ చికిత్స అందించారు. తీవ్ర అస్వస్థతకు గురైన వారిలో ఎనిమిది మంది పరిస్థితి కాస్త విషమంగా ఉన్నట్టు గ్రామస్తులు తెలిపారు.

సేవలతో పోలీసులకు చేరువైన గిరిజనులు



వాలీబాల్ క్రీడాకారులతో మాట్లాడుతున్న సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ రాజేష్ పాండే



ప్రథమస్థానంలో నిలిచిన మంగబంద జట్టుతో సీఆర్‌పీఎఫ్ పోలీసులు

- సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ రాజేష్ పాండే
- సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వాలీబాల్ పోటీలు
- విజేత జట్టుకు ట్రోఫీ, క్రీడా పరికరాలు, టీషర్టుల పంపిణీ

పెదబయలు: సేవలతో పోలీసులకు గిరిజనులకు మరింత చేరువయ్యారని సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ రాజేష్ పాండే అన్నారు. బుధవారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా సీఆర్‌పీఫ్ 198 బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన క్రీడాకారులో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో మారుమూల గ్రామాలకు వెళ్లినప్పుడు గిరిజనులు పోలీసులకు దూరంగా ఉండేవారన్నారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. వారి సమస్యలు పోలీసులు దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం కోరుతున్నారన్నారు. అందుకు తగ్గట్టుగానే పోలీసులు కూడా వారి సమస్యలు పరిష్కారంలో భాగస్వాములు అవుతున్నారన్నారు. ఈ టోర్నీలో మండలంలోని ఆరు జట్లు పాల్గొన్నాయి.గలగండ పంచాయతీ మంగబంద జట్టు ప్రథమ, పురుగుడి పుట్టు జట్టు ద్వితీయ, రోగులపేట జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. విజేతలకు ట్రోఫీ, వాలీబాల్ నెట్, టీషర్టులను అందజేశారు. సీఆర్‌పీఎఫ్ కమాండర్ పి.చరణ్‌రాజ్, ఎస్‌ఐ పి.మనోజ్‌కుమార్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు సీకరి సర్పంచ్ గుల్లేలు కృష్ణారావు పాల్గొన్నారు.

21 నుంచి పారా స్విమ్మింగ్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి పారా స్విమ్మింగ్ పోటీలు ఈనెల 21 నుంచి రైల్వే అక్వా స్పోర్ట్స్‌లో జరగనున్నాయి. పారా స్పోర్ట్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎ.మల్లికార్జున తన చాంబర్‌లో పోటీల గోడపత్రికను విడుదల చేశారు. పారా క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో చక్కటి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక ప్రతినిధి బృందం పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం తగదు

అరకు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి అభిషేక్



ఎన్నికల సహాయ అధికారులతో మాట్లాడుతున్న అరకు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి అభిషేక్

పాడేరు : సార్వత్రిక ఎన్నికల విధుల్లో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఐటీడీఏ పీవో, అరకు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి వి. అభిషేక్ హెచ్చరించారు. బుధవారం స్థానిక ఐటీడీఏలో అరకు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఆరుగురు ఎన్నికల సహాయ అధికారులు (తహసీల్దార్లు)తో సమావేశం నిర్వహించారు. సకాలంలో ఓటింగ్ యంత్రాలను, ఎన్నికల సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల సహాయ అధికారులు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించాలని సూచించారు. ఏజెన్సీలో భౌగోళిక పరిస్థితులు, సామాజిక పరిస్థితులు మైదాన ప్రాంతాల కంటే భిన్నంగా ఉంటుందని ఎన్నికల అధికారులు సానుకూల దృక్పథంతో విధులు నిర్వహించాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి సజావుగా ఓటింగ్ జరిగేలా ఇప్పటి నుంచి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన సౌకర్యాల కల్పనకు ఇప్పటి నుంచి ప్రణాళికపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఎన్నికలకు అవసరమైన మేరకు వాహనాలకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు.

క్లుప్తంగా

పర్యాటకులకు ఇక్కట్లు

- రైల్వే గేటు వల్ల నిలిచిపోతున్న వాహనాలు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు వెళ్లేమార్గంలో గేటు వలస వద్ద రైల్వే గేటు పడినప్పుడల్లా వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కేకేలైన్‌లో గల ఈ గేటు వద్ద గూడ్స్, పాసింజర్ రైళ్లు తిరుగుతుంటాయి. రైల్వే గేటు పడినప్పుడల్లా పర్యాటకుల ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాంతంలో ఫ్లైవోవర్ నిర్మించాలని వారు కోరుతున్నారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు

గంగవరం: మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో ఆర్టీసీ బస్సులను బుధవారం పోలీసులు ముమ్మర తనిఖీ చేశారు. బస్సుల్లో ప్రయాణికుల బ్యాగులు, లగేజీలను సోదా చేశారు. అనుమానితులను ప్రశ్నించి, వివరాలను సేకరించారు.

గంజాయితో ఇద్దరు అరెస్టు

డుంబ్రిగుడ: మండలంలోని అరకు -పాడేరు జాతీయ రహదారిలో జైపూర్ జంక్షన్ సమీపంలో రెండు కిలోల గంజాయిని బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఇక్కడ వాహనాలు తనిఖీ చేస్తుండగా, స్కూటీపై గంజాయి తరలిస్తున్న విశాఖ పట్నానికి చెందిన రేగ రోహిత్, కొల్లా సునీల్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి స్కూటీతోపాటు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో, వ్యాన్ ఢీ: ఐదుగురికి గాయాలు


గోతిలో బోల్తా పడి ఉన్న ఆటో

మారేడుమిల్లి: మండలంలోని ఉక్కులూరు జంక్షన్ వద్ద బుధవారం వ్యాన్ , ఆటో ఢీకొని పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. మండలంలోని మారేడుమిల్లి నుంచి పుల్లంగి గ్రామానికి వస్తుండగా, స్థానిక జీసీసీకి చెందిన వ్యాన్ ఆకుమామిడి కోట గ్రామం నుంచి మారేడుమిల్లి వస్తుండగా ఉక్కులూరు జంక్షన్ వద్ద మలుపులో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో గోతులో పడి పోయింది. ఆటోలో ఉన్న ప్రయాణికులు సాదల మరియమ్మ, కలుగుల రమ్య, గొర్లె బానుబాబు, కె.పద్మలీలా, బచ్చెల మర్తమ్మలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి వారిని అంబులెన్స్‌లో బోదులూరు పీహెచ్‌సీకి తరలించారు.

గంగారావు నేర కథా చిత్రం.!

- సినిమాలోనే కాదు.. గంగారావు నిజ జీవితంలోను విలనే..!
- తహసీల్దార్ హత్య కేసులో నిందితుడి క్రైమ్ చిట్టా పెద్దదే..
- మూడేళ్ల క్రితం 'ది నైట్' పేరుతో సినిమా తీసిన గంగారావు
- డబ్బులు ఇవ్వకపోవడంతో సినిమా నుంచి తప్పుకున్న డైరెక్టర్
- స్వీయ దర్శకత్వ అవతారమెత్తి విలన్‌గా చేసిన గంగారావు
- అందులో హీరోయిన్‌ను రాడ్‌తో కొట్టినట్టే తహసీల్దార్‌ను కొట్టి చంపిన హంతకుడు
- గతంలో రోడ్డు కాంట్రాక్టు ఇప్పిస్తానని హైదరాబాద్‌లో ఒక వ్యక్తికి రూ.1.5 కోట్లు టోకరా
- వాటర్ ప్లాంట్ పేరుతో విజయవాడలో రూ.40 లక్షలు మోసం
- తవ్వే కొద్దీ బయటపడుతున్న గంగారావు అక్రమాలపై కథనం

విశాఖ సిటీ: తహసీల్దార్ రమణయ్య హత్య కేసులో నిందితుడు మురారీ సుబ్రహ్మణ్యం గంగారావు క్రైమ్ కథా చిత్రంలో కొత్త ట్విస్టు వెలుగులోకి వచ్చింది. మూడేళ్ల క్రితం థియేటర్లలో విడుదలకు నోచుకోని ఒక సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా తీసినట్లు తేలింది. ఆ సినిమాకు గంగారావే ప్రొడ్యూసర్.. డైరెక్టర్.. విలన్ పాత్రలు కూడా పోషించాడు. ఇదిలా ఉంటే.. ఆ సినిమాలో హీరోయిన్‌ను రాడ్‌తో కొట్టి చంపినట్టే అచ్చం తహసీల్దార్ రమణయ్యను కూడా కొట్టి హత్య చేయడం గమనార్హం. సినిమాలో చేసిన పాత్రను యథాతథంగా నిజజీవితంలో చేసినట్లు స్పష్టమవుతోంది. అలాగే ఇతగాడి క్రైమ్ చిట్టా చాలా పెద్దదే అన్నట్లు తెలుస్తోంది. ఒక్కో చోట ఒక్కో అవతారం ఎత్తి వ్యాపారులు, రియల్టర్లను రూ.లక్షలు, రూ.కోట్లకు ముంచేశాడు. అక్కడ కేసుల్లో చిక్కుకొని చివరకు విశాఖకు చేరుకొని ఇక్కడ కూడా అదే పంథాలో వెళ్లి చివరకు తహసీల్దార్‌ను హత్య చేశాడు.

సినిమాలో చంపినట్లే..

మురారీ సుబ్రహ్మణ్యం గంగారావు మూడేళ్ల క్రితం 'ది నైట్' అనే క్రైమ్ థ్రిల్లర్ సినిమా తీశాడు. దీనికి అతడు ప్రొడ్యూసర్‌గా వ్యవహరించాడు. ఈ సినిమాకు దర్శకత్వం వహించిన సునీల్‌కు డబ్బులు ఇవ్వకపోవడంతో అతడు ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నాడు. దీంతో గంగారావు డైరెక్టర్ అవతారమెత్తాడు. అంతేకాకుండా ఆ సినిమాలో విలన్ పాత్ర పోషించాడు. ఈ సినిమాలో ఒక సన్నివేశంలో విలన్‌గా నటించిన గంగారావు హీరోయిన్ తలపై రాడ్డుతో కొడతాడు. అదే తరహాలో తహసీల్దార్ రమణయ్యను కూడా అపార్ట్‌మెంట్ సెల్లార్ తలపై రాడ్డుతో కొట్టి చంపాడు. సినిమాలో నటించిన మాదిరిగానే నిజ జీవితంలో కూడా హత్య చేయడం గమనార్హం.

క్రైమ్ చిట్టా పెద్దదే..

గంగారావు ఒక్కో ప్రాంతంలో ఒక్కో అవతారం ఎత్తి అక్కడి వారిని మోసం చేసి జిల్లాలు మారుకుంటూ విశాఖకు వచ్చాడు. హైదరాబాద్‌లో ఉన్న సమయంలో గంగారావు పెద్ద వ్యాపారవేత్తగా, ఆర్థికంగా స్థితిమంతుడిగా, అక్కడి ప్రభుత్వ పెద్దలతో మంచి సత్సంబంధాలు ఉన్నట్లు కలరింగ్ ఇచ్చేవాడు. ఈ క్రమంలో పత్తిపాటి రవి అనే వ్యక్తికి రోడ్డు కాంట్రాక్ట్ ఇప్పిస్తానని చెప్పి రూ.1.5 కోట్లకు టోకరా వేశాడు. దీనిపై రవి కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో చీటింగ్ కేసు నమోదైంది. ఆ తరువాత గంగారావు హైదరాబాద్‌లో దుకాణం సర్దేసి విజయవాడకు మకాం మార్చాడు. అక్కడ కూడా పలుకుబడి ఉన్నట్లు చెప్పుకుంటూ భవానీపురం ప్రాంతానికి చెందిన విరూపాక్ష అనే వ్యక్తికి వాటర్ ప్లాంట్ పేరుతో రూ.40 లక్షలకు మోసం చేశాడు. సదరు బాధితుడు కూడా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విజయవాడలో మరో కేసు నమోదైంది. ఆ జిల్లా నుంచి మకాం మార్చి విశాఖకు చేరుకున్నాడు. ఇక్కడ మధురవాడలో జ్యువెల్ అపార్ట్‌మెంట్‌లో ఒంటరిగా నివాసముంటున్నాడు.

ఇక్కడ ఎన్‌ఆర్‌ఐలతో ఒప్పందం

విశాఖకు వచ్చిన గంగారావు రియల్టర్ అవతారమెత్తాడు. ఒక ఆఫీస్ తెరిచి పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారిగా అందరినీ పరిచయం చేసుకున్నాడు. ఈ క్రమంలో ఏడుగురు ఎన్‌ఆర్‌ఐలకు సంబంధించిన కన్వేయన్స్ డీడ్స్ చేయిస్తానని నమ్మించాడు. రూ.లక్షలకు వారితో ఒప్పందం చేసుకొని అడ్వాన్స్ కూడా తీసుకున్నాడు. ఆ పని కోసమే తరచూ విశాఖ రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లేవాడు. ఈ వ్యవహారంలో కార్యాలయంలో కొంత మేర నగదు లావాదేవీలు కూడా జరిగినట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. తహసీల్దార్ కార్యాలయంలో ఎవరెవరికి ఎంత మొత్తంలో డబ్బు ఇచ్చాడన్న విషయాన్ని గంగారావు ఒక డైరీలో రాసుకున్నట్లు సమాచారం. అయితే తహసీల్దార్ ఆ పనిచేయలేదు. ఇక్కడి నుంచి విజయనగరం జిల్లా బొండపల్లికి బదిలీ అయ్యారు. ఒకవైపు ఎన్‌ఆర్‌ఐల నుంచి ఒత్తిడి ఉండడంతో గంగారావు తహసీల్దార్‌పై కోపంతో హత్య చేశాడు.



పీకల్లోతు అప్పుల్లో..

మురారీ సుబ్రహ్మణ్యం గంగారావు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అతడి మోసాలు, అప్పులు, వారి వేధింపులతో విసిగిపోయిన భార్య విడాకులు ఇచ్చేసి దూరంగా వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. గంగారావుకు సుమారు రూ.4 నుంచి రూ.5 కోట్లు వరకు అప్పులు ఉన్నట్లు సమాచారం. అలాగే అతడి ఇంటిపై రుణం తీసుకొని తిరిగి చెల్లించకపోవడంతో బ్యాంకు వారు ఇంటిని స్వాధీనం చేసుకొని వేలం వేసినట్లు పోలీసులు గుర్తించారు. ఒకవైపు ప్రతి ప్రాంతంలోను ఎవరో ఒకరిని మోసం చేసి రూ.కోట్లకు టోకరా వేసిన గంగారావు అంత అప్పుల్లో కూరుకుపోవడానికి గల కారణాలు ఇప్పుడు సస్పెన్స్‌గా మారింది.

గడప గడపకు సంక్షేమ పాలన

వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ సమన్వయకర్త విశ్వేశ్వరరాజు


పాతపాడేరులో స్థానికులకు పథకాలను వివరిస్తున్న పాడేరు అసెంబ్లీ సమన్వయకర్త విశ్వేశ్వరరాజు

సాక్షి,పాడేరు: గిరిజన ప్రాంతాల్లో గడప గడపకు సంక్షేమ పాలన అందిందని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంతోను అన్ని వర్గాల గిరిజనుల అభ్యున్నతి సాధ్యమైందని వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. పాడేరు మేజర్ పంచాయతీ, పాతపాడేరు గ్రామంలో ఆయన బుధవారం ఇంటింటా పర్యటించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హాయంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలతో పాటు నవరత్న పథకాలతో జిల్లాలో పేదలకు జరిగిన అభ్యున్నతిని వివరించారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పేదల బ్యాంకు ఖాతాల్లోకి ప్రభుత్వ సంక్షేమ పథకాల నిధులను నేరుగా జమ అవుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి, జగనన్నను మరలా ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, జోనల్ ఇన్‌చార్జి కిముడు విశ్వ, సర్పంచ్‌లు గబ్బాడ చిట్టిబాబు, వంతాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు సన్యాసినాయుడు, నాయకులు కోటిబాబు, ప్రకాష్‌నాయుడు, జి.భాస్కర్, వార్డు సభ్యులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జెన్‌కో అధికారులకు వినతి


జెన్‌కో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

సీలేరు: ఏపీ జెన్‌కో సీలేరులో 60 ఏళ్లుగా నివాసం ఉంటున్న స్థానికులకు పూర్తిస్థాయిలో పక్కా గృహాలు నిర్మించుకునేందుకు అనుమతులు ఇవ్వాలని ఈ సందర్భంగా స్థల పరిశీలనకు వచ్చిన అధికారులకు వినతిపత్రాన్ని ప్రజా ప్రతినిధులు ,గ్రామస్థులు ఇచ్చారు. ప్రజాభిప్రాయ సేకరణలో అన్ని సదుపాయాలు కల్పిస్తామని ప్రకటించారని దాన్ని అమలుచేసేలా చూడాలని చీఫ్ ఇంజినీర్ శ్రీధర్, ఎస్‌ఈలు ప్రశాంత్‌కుమార్, చంద్రశేఖర్ ఇచ్చిన వినతిలో కోరారు. దీనిపై వారు స్పందించి ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. కొత్తప్రాజెక్టు నిర్మించే పార్వతినగర్ శాండికోరి, సీలేరులో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి స్థానికులకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సర్పంచ్ దుర్గో , ఎంపీటీసీ సభ్యుడు సాంబమూర్తి , ఉప సర్పంచ్ ప్రసాద్ , శ్రీనివాసు, తిరుమలరావు, వెంకటరావు తదితరులున్నారు.

యాంపీ థియేటర్ పరిశీలన

సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో..

ఏయూక్యాంపస్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ పర్యటన నేపథ్యంలో ఆంధ్రా యూనివర్సిటీలోని కె.వి.గోపాలస్వామి యాంపీ థియేటర్‌ను బుధవారం కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున పరిశీలించారు. వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, ఏడీసీపీ మణికంఠ, జీవీఎంసీ ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలసి అక్కడ పరిస్థితులను సమీక్షించారు. ఆడుదాం-ఆంధ్రా ముగింపు సందర్భంగా పీఎంపాలెంలోని ఏసీఏ క్రికెట్ స్టేడియం, ఏయూలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలో ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. థియేటర్ సామర్థ్యం, ప్రవేశం, బయటకు దారి మార్గాలు, సభ ఏర్పాటు తదితర అంశాలపై వారితో చర్చించారు. కార్యక్రమ నిర్వహణ సాధ్యాసాధ్యాలపై కలెక్టర్ సమీక్షించారు.

ఆడుదాం ఆంధ్రా క్రీడాకారులకు చక్కని ఏర్పాట్లు

మధురవాడ, ఆనందపురం: ఆడుదాం ఆంధ్రా పోటీలకు వివిధ జిల్లాల నుంచి విశాఖ వచ్చే క్రీడాకారులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా వసతి ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. క్రీడాకారుల వసతి కోసం కేటాయించిన మధురవాడ సుద్దగెడ్డ, దబ్బందలోని టిడ్కో ఇళ్ల సముదాయాలను బుధవారం ఆర్డీవో భాస్కరరెడ్డితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నగరంలో ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు ఐదు క్రీడాంశాల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుద్దగెడ్డ వద్ద సుమారు 1,400 మంది మహిళా క్రీడాకారులకు, దబ్బందలో సుమారు 1,600 మంది పురుష క్రీడాకారులకు వసతి ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. క్రీడాకారులు నిద్రించేందుకు మ్యాట్స్ మొదలు మరుగుదొడ్లు, పరిశుభ్రత, ఆయా గదులకు గడియారాలు, లైటింగ్, భోజనం, రవాణా, భద్రత తదితర ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. ఆయా పనుల బాధ్యత తీసుకున్న అధికారులు ఏ విధమైన లోటుపాట్లు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. కారిడార్, కాలనీలో కూడా లైటింగ్, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్డీసీ పద్మలత, జెడ్పీలు డి.లక్ష్మి, కనక మహాలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఆర్‌ఐ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

వై.రామవరం: మండలంలోని కోట గ్రామ సచివాలయం పరిధిలోని సిరిమెట్ల గ్రామ శివారు అటవీ ప్రాంతంలో (రిజర్వు ఫారెస్టులో) మైదాన ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి తన పట్టా భూమికి వెళ్లేందుకు అక్రమంగా రోడ్డు నిర్మాణంపై అటవీశాఖాధికారులు సర్వే చేసి, విచారణ చేపట్టారు. గ్రామంలోని అటవీ ప్రాంతంలో చేపట్టిన అక్రమ రోడ్డును, చెట్ల నరికివేతపై అందిన సమాచారం మేరకు సబ్ డీఎఫ్‌ఓ రామారావు, అడ్డతీగల రేంజ్ అధికారి సయ్యద్ సహెన్‌షాల ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ రోడ్డు వెడల్పులో భాగంగా కొన్ని చెట్లను నరికారన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.


సిరిమెట్లలోని అటవీ ప్రాంతంలో నిర్మించిన రోడ్డును పరిశీలిస్తున్న సబ్ డీఎఫ్‌వో రామారావు, రేంజ్ అధికారి సహెన్‌షా

ఏయూకి ఐపీ ఎక్సలెన్స్ అవార్డు


అవార్డును స్వీకరిస్తున్న డాక్టర్ పురుషోత్తం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఐపీ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. న్యూఢిల్లీలో 5వ ఐపీ ఎక్సలెన్స్ అవార్డును అసోచాం అందించగా.. ఏయూ ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం ఈ అవార్డును స్వీకరించారు. మేధో హక్కుల రంగంలో చేస్తున్న విశేష కృషిని గుర్తిస్తూ అసోచాం ఈ అవార్డును ప్రదానం చేసిందని డాక్టర్ పురుషోత్తం తెలిపారు. ఏయూ ఐపీఆర్ చైర్ ఆధ్వర్యంలో 125 పేటెంట్‌లు దరఖాస్తు చేశామని.. వీటిలో ఆరు పేటెంట్‌లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీటిని త్వరలో వాణిజ్యీకరణ చేసే దిశగా ఆలోచన చేస్తున్నట్లు వివరించారు.

విశాఖ టు అబుదాబి

పయనమైన ఇంగ్లండ్ క్రికెటర్లు


విశాఖ విమానాశ్రయం టెర్మినల్ లోపలికి వెళ్తున్న ఇంగ్లండ్ క్రికెటర్లు

గోపాలపట్నం: ఇంగ్లండ్ క్రికెటర్లు బుధవారం విశాఖ నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. ఉదయం 7.30 గంటలకు బస్సుల్లో విమానాశ్రయానికి చేరుకున్న క్రికెటర్లు.. ప్రత్యేక విమానంలో నేరుగా అబుదాబి వెళ్లారు. వైఎస్సార్ స్టేడియంలో భారత్‌తో జరిగిన రెండో టెస్ట్‌లో ఆ జట్టు ఓటమి పాలైన సంగతి తెలిసిందే. రాజ్‌కోటలో ఈ నెల 15 నుంచి మూడో టెస్ట్ ప్రారంభం కానుంది. ఈ మధ్య సమయాన్ని అబుదాబిలో గడపడానికి పర్యాటక జట్టు పయనమైంది. భారీగా తరలివచ్చిన అభిమానులు ఇంగ్లండ్ క్రికెటర్లకు వీడ్కోలు పలికారు. విమానాశ్రయంలోకి వెళ్తున్న సమయంలో వారిని తమ సెల్‌ఫోన్లలో బంధించేందుకు ఎగబడ్డారు.

ముగ్గురు సీఎంలు.. భిన్న పార్శ్వాలు

మూడు దారులు పుస్తక పరిచయ సభలో వక్తలు

సీతంపేట: ముగ్గురు ముఖ్యమంత్రుల పాలన చరిత్రకు 'మూడు దారులు' పుస్తకం ప్రతీకగా నిలుస్తుందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి ప్రొఫెసర్ వి.బాలమోహన్ దాస్ అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ దేవులపల్లి అమర్ రచించిన మూడు దారులు పుస్తక పరిచయ సభ బుధవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాలను జర్నలిస్టులు ప్రభావితం చేస్తారన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తాను వీసీగా విధులు నిర్వహించినప్పటి సంఘటనలు గుర్తు చేసుకున్నారు. సామాజిక విలువలు పాటిస్తూ పుస్తకం రాసిన రచయిత అమర్ అభినందనీయులన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఏయూ జర్నలిజం విభాగం విశ్రాంత ప్రధానాచార్యులు ప్రొఫెసర్ పి.బాబీవర్ధన్ మాట్లాడుతూ పాత్రికేయుడు అమర్ రాసిన మూడు దారులు పుస్తకంపై పీహెచ్‌డీ చేయవచ్చన్నారు. సాధారణంగా చరిత్ర, జీవిత కథలను రాస్తూ ఉంటారని, అందుకు భిన్నంగా ముగ్గురు ముఖ్యమంత్రుల పాలన చరిత్రను అమర్ రాశారన్నారు. ప్రముఖ పాత్రికేయుడు మంగు రాజగోపాల్ మాట్లాడుతూ జర్నలిస్టులు ఎప్పటికప్పుడు సమాజంలోని రాజకీయ పరిణామాలకు అప్‌డేట్ అవ్వాలని, వారిలో అమర్ ముందుంటారన్నారు. ముగ్గురు ముఖ్యమంత్రుల పరిపాలనను స్వయంగా చూసిన అమర్ ఈ పుస్తకం రాశారని తెలిపారు. రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వి.వి.రమణమూర్తి పుస్తకాన్ని సమీక్షిస్తూ చరిత్రను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత పాత్రికేయులపై ఉందని.. ఈ పుస్తకం ద్వారా అమర్ తన బాధ్యత నెరవేర్చారన్నారు. ఈ పుస్తకం ముగ్గురు ముఖ్యమంత్రులను కథా వస్తువుగా తీసుకున్నారని, నాలుగో ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కూడా దర్శనమిస్తారన్నారు. అధికారం కోసం ఆనాడు చంద్రబాబు.. ఎన్టీఆర్‌ను వెన్నుపోటుకు సైతం వెనుకాడని సంఘటన పుస్తకంలో సాక్షాత్కరిస్తుందన్నారు. వైస్రాయ్ కుట్రలో వాస్తవాలను రచయిత పుస్తకంలో పొందుపర్చారని తెలిపారు. ఎన్టీఆర్ ఆత్మ ఎలా క్షోభించింది? అడ్డదారిలో చంద్రబాబు అధికారం ఎలా చేజిక్కించుకున్నారో ఈ పుస్తకం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఇవన్నీ ఆధారాలతో రాయడం విశేషమన్నారు.

ఆధారాలతో వాస్తవాలు ఆవిష్కరణ

పుస్తక రచయిత అమర్ మాట్లాడుతూ దక్షిణాదివారిని ఉత్తరాదివారు పట్టించుకోరని, మద్రాసీయులుగా పిలిచే తెలుగు వారిని ఆంధ్రులుగా ఎన్టీఆర్ గుర్తింపు తెచ్చారన్నారు. వైఎస్సార్, చంద్రబాబు ఒకేసారి రాజకీయాల్లోకి వచ్చారని, 1983 వరకు ఒకే పార్టీలో కలసి ప్రయాణించారన్నారు. 1983లో ఓడిపోయిన తర్వాత చంద్రబాబు టీడీపీలో చేరి.. తర్వాత కాలంలో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. 2011, 2014 ఎన్నికల్లో బీజేపీ, ఆ తర్వాత జనసేన మద్దతుతో పోటీ చేశారని, ఏనాడు ఒంటరిగా చంద్రబాబు గెలవలేదన్నారు. వైఎస్సార్ మాత్రం మొదటి నుంచి చివరి వరకు కాంగ్రెస్‌లోనే కొనసాగారన్నారు. వీరిద్దరికీ భిన్నంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎదిగారని తెలిపారు. తండ్రి మరణం వల్ల చనిపోయిన అభిమానులను ఓదార్చడానికి కాంగ్రెస్ అధిష్టానం అడ్డుపడటం, దాంతో బయటకు వచ్చి పార్టీని స్థాపించడం, ఈడీ కేసులతో 16 నెలలు జైలుకి వెళ్లడం, వీటన్నింటినీ ధైర్యంగా ఎదుర్కొని.. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని తెలిపారు. తాను వైఎస్సార్‌కు సన్నిహితమని గానీ, సీఎం జగన్ పాలనలో సలహాదారుడిగా పని చేశానని గానీ వారికి అనుకూలంగా, చంద్రబాబుకి వ్యతిరేకంగా ఈ పుస్తకం రాయలేదన్నారు. ఆధారాలతో వాస్తవాలు ఆవిష్కరించినట్లు చెప్పారు. ఈ పుస్తకం చదివితే అన్ని వాస్తవాలు తెలుస్తాయన్నారు. అనంతరం రచయితను ఘనంగా సత్కరించారు.


మాట్లాడుతున్న రచయిత, సీనియర్ పాత్రికేయుడు అమర్

రిమాండ్ ఖైదీ అనుమానాస్పద మృతి

ఆరిలోవ : విశాఖ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీ మృతి చెందాడు. దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జైల్ అధికారులు కార్డియక్ అరెస్టుతో మృతి చెందినట్లు వెల్లడిస్తుండగా మృతుడు బంధువుల మాత్రం జైల్‌లో తోటి ఖైదీలుగాని, సిబ్బందిగాని కొట్టి హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై బుధవారం కేజీహెచ్ మార్చురీ వద్ద మృతుడి బంధువులు ఆందోళన చేశారు. కేంద్ర కారాగారం పర్యవేక్షణాధికారి కిశోర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం బడంబీరు గ్రామానికి చెందిన కోడ పోతన్న(45) గంజాయి కేసులో నిందితుడు. ఆయనను అక్కడ పోలీసులు 2023 జూలై 27న విశాఖ జైలుకు తీసుకువచ్చారు. అప్పటి నుంచి రిమాండ్‌లో ఉన్నాడు. మంగళవారం ఉదయం ఆయనకు గుండె సంబంధ సమస్యతో ఊపిరాడకపోవడంతో జైలు వైద్యులు ప్రాథమిక చికిత్స చేశారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించడంతో కొంతసేపటికి మెరుగుపడింది. మళ్లీ కొంత సమయం తర్వాత గుండె నొప్పి రావడంతో సాయంత్రం ప్రాణాలు విడిచాడని కేజీహెచ్ వైద్యులు తెలిపినట్లు జైల్ సూపరింటెండెంట్ తెలిపారు. దీనిపై మృతుడు కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

ఉద్యోగ అవకాశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అడ్డతీగల: పోలీసు శాఖ నిర్వహిస్తున్న ప్రేరణ కార్యక్రమం ద్వారా ఉపాధి అవకాశాలు కోసం అర్హులైన వారి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీఐ ఎం.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు తమ పేర్లు, వివరాలను స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం సాయంత్రంలోగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రశాంతి ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ సహకారంతో టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఉద్యోగాలకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రతి పోలింగ్ బూత్‌లో మౌలిక సదుపాయాలు ఉండే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నట్లు రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్ చెప్పారు. రంపచోడవరం తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సెక్టార్ల అధికారులు బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మరుగుదొడ్లు, కరెంటు, రన్నింగ్ వాటర్ సిద్ధం చేయాలన్నారు. సమస్యాత్మకమైన పోలింగ్ బూత్‌లు ఎక్కడైనా ఉంటే తెలియజేయాలన్నారు. సెక్టార్ అధికారులు ఎప్పటికప్పుడు పోలింగ్ బూత్‌లు పరిశీలించి ఎక్కడైనా మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. పోలింగ్ బూత్‌లు పరిశీలించినప్పుడు ఫోటోలు తీసి సమర్పించాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు సెక్టార్ల అధికారులు, బీఎల్‌వోలు, జోనల్ అధికారులు పనిచేయాలన్నారు. తహసీల్దార్ ఎ.కృష్ణజ్యోతి, డీటీలు ఎస్.వి.వి.సత్యనారాయణ, బి.రాజు, సీనియర్ అసిస్టెంట్లు ఇందిరా బాయి, లక్ష్మణ్, చెల్లాయమ్మ, ఆర్‌ఐ విఘ్నేష్ పాల్గొన్నారు.


సెక్టార్ అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

పందెంరాయుళ్ల అరెస్టు

కొయ్యూరు: మండలంలోని బకులూరులో కోడి పందాల శిబిరంపై దాడులు చేసి ఆరుగురిని అరెస్టు చేసి, రూ.3,700 నగదు, ఆరు కోళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.